# చుక్కకోసం

భళ్ళున తెల్లవారినా బద్ధకం వదలలేదు పోలయ్యని. పల్లెపల్లె అంతా మేలుకొని పొలాలు పట్టి పోతున్నా పోలయ్యకి మంచం దిగాలనిపించలేదు. ఎందుకనిపిస్తుంది? చెప్పినమాట వినే రత్నంలాంటి కొడుకు, చెప్పకుండానే మనసు కనిపెట్టి మసలే చెట్టంత తమ్ముడు, కనుసన్నల్లో మెలిగే పాలేళ్ళూ ఇంక చెప్పాలా పంటలక్ష్మి పరుగులతో ఇంటి ముందుకు రాదూ. ఆ ధీమామే అతని చేత కంబళి ముసుగు పెట్టించి హాయిగా గురక తీయిస్తోంది. భడాలున తలుపుచప్పుడు ఒక్కసారిగా ఆ గురకనే ఓడించేసింది.

''ఓరదీ, నింపాదిగా ఏలిత్తే మీ సొమ్మేం పోతాది'' ముసుగులోంచే అన్నాడు. '' ఓ సోస్... గురకెట్టి నిద్రోతూ మా గొప్పగా సెప్పుతున్నావ్‌గాని తలుపు విరిగిపడితే వాటిల్ని నిలబెట్టానికి పోయేది నీసొమ్మే, తెలవక కాదు. పదిసార్లు పిలిసినా అరడజను సార్లు అరిసినా మాయదారి నిద్ర నిన్ను ఒగ్గితేనా. సేసేది లేక సేతులు నొప్పి పెట్టేట్టు తలుపు కొట్టినా. లెగిసిరా బావా. తలుపు తెరు. నిలుసోలేక కాల్లు పీకెత్తన్నాయ్?''

పోలయ్య తలుపు తెరిసాడో లేదో పుల్లయ్యలోనికి ప్రవేశించి వాటిని మరింత గట్టిగా బిడాయించేశాడు. మరతడు చేయబోయే పని అలాటిది. పోలయ్య బద్ధకం పటాపంచలై పోయింది. అమాంతం పుల్లయ్య అతని రెండు పాదాలూ పట్టుకునే సరికి

''ఏటా పని ఏటి'' కాళ్ళు వెనక్కు తీసుకోబోయాడు. '' నానొగ్గేది నేదు బావా. నీవు నాకో వాగ్దానం సెయ్యాల.'' '' వాగ్దానం నేదు పెదానం నేదు కాని నువ్విట్టా కూకో. మరి నాను పస్సుగా బెస్ సేసేసి ఎల్లిపొచ్చేత్తా. మా ఇంటి దానితో సెప్పి ఏడిగా టీ అంపిత్తా. తాగేయ్. అప్పుడు ఇసయాలన్నీ మాటాడుకుందాం.'' పోలయ్య తుర్రుమన్నాడు . తన భారీ కాయం పరిగెత్తడానికి సహకరించక పోయినా కష్టపడ్డాడు.

తండ్రి బావి దగ్గరకు రాగానే చుక్క నీళ్ళు తోడి అందించింది. మొగం కడుక్కుంటూ ఆలోచనలో పడ్డాడు. నిన్న మొన్నటి దాకా తనని నేతిలో ఈగను తీసి పారేసినట్టు తేలికగా చూసిన పుల్లయ్య వున్నట్టుండి పాదాలు పట్టుకోవడమేంటి? ఇట్టాటోల్లే కాళ్ళట్టుకొని కావలసిన పని కాగానే గాడిదలను సేత్తారు. ఈన్నసలు నమ్మనంటే నమ్మను. తీర్మానించేసుకున్నాను.

పొగలు కక్కుతున్న టీ పుల్లయ్య ఎదురుగా బల్లపై పెట్టింది వీరమ్మ. ఆత్రంగా తాగబోయాడు. నాలుక చుర్రుమంది. ఆ చురక మనసుకు కూడా అంటింది. అంతదుమరి చేసిన శపథం మట్టి కలసి పోతోంది. ఈ గడప తొక్కనని, ఈ ఇంట్లో ఏ ఒక్కరి ముఖం చూడనని వీళ్ళచేత్తో పచ్చిమంచినీళ్ళు కూడా ముట్టుకోనని ఎన్నెన్నో అన్నాడు. కానీ ఈ పరిస్థితి ఏమిటి? వాళ్ళ కాళ్ళు పట్టుకోవడం అంటే చిన్నమాటా. ఎంత దిగజారుడు తనం తప్పదుమరి. కన్న కొడుకు కోసం ఇంతా చేయవలసి వస్తోంది. తలెత్తుకొని దర్జాగా బతికినా. అడ్డమైన వాళ్ళ కాళ్ళు పట్టుకొని నీవే దిక్కు అనవలసి వచ్చినా అంతా కన్నబిడ్డల వల్లే. ఆ రోజు తన ఇంటికొచ్చి ఎంత వినయంగా చేతులు కట్టుకొని నిలబడ్డాడీ పోలిగాడు. అప్పుడు తమ ఇద్దరి మధ్యా సాగిన సంభాషణంతా ఇప్పటికే చెవుల్లో గింగురుమంటోంది. టీ కప్పు చేతుల్లో ఉంచుకొని గొంతు తడుపు కోలేని పుల్లయ్యకి "ఏటీ పొద్దున్నే ఇలా పారొచ్చినావ్. ఇట్టాటేల సుట్టమీద సుట్టెలిగిత్తూ నీలా కాలీగా కూకుంతాననుకుంటున్నావా" దర్పంగా అన్నాడు పుల్లయ్య.

"అట్టా ఎందుకనుకుంతాను బావా. సిన్న పనిబడి ఈయేలప్పుడొచ్చినా. తెల్లారగానే మంచి యినయాలు ముచ్చటించుకుంటే శుభం గందా" అంటూ విషయం పుల్లయ్య ముందుంచేసరికి అతగాడు నిప్పుతొక్కిన కోతే అయ్యాడు. "ఏటేటిరా పోలిగా నీతో ఇయ్యమందాలా. నువ్వేడ నానేడ? నక్కకకి నాగలోకానికీ సాటంటరా. పట్టుమని పదెకరాలు మగానైనా లేనోడివి మాతో ఎట్టా తూగుదామని. నీ భూమికి పదింతలు భూమి టౌనుకాడ చెఱుకు ప్యాక్టరీ, ఆడ భవనం, ఈడ తోట అట్టాటి మాతో గుడిసెలాటి ఇంట్లో ఉంటూ పండిన గింజ ఇంటికే సరిపెట్టుకుంటున్నోడివి పిల్లనిత్తానని అడగడానికే వచ్చినావ్" అని పుల్లయ్య అహంకారంతో ఏకిపారేస్తున్నా ఆవేశపడలేదు పోలయ్య.

"డబ్బు, దస్కం మాట పక్కనెట్టుబావా. పేమను మించింది నేదు. మీ అబ్బి, మా అమ్మి గుండెనిండుగా పేమించేసుకున్నారు. నువ్విట్టా అనేత్తున్నావ్ గాని మా అమ్మికేటిరా. బంగారు బొమ్మ. మీ మల్లిగాడ్ని కళ్ళల్లో ఎట్టుకొని సూత్తాది. నా సిట్టితల్లి నా ఇంటి కోడలైపోవాదానీ ఇంట మాలచ్మి అడుగెట్టేసినట్టే అనుకో నా తల్లి అట్టాటి జాతకురాలు" నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు.

"ఓసోస్. ఇంతోటి నీ బొట్టి నచ్చిందేవా. నన్ను బుట్టలో ఎయ్యాలని చూడకు. సచ్చినా నేనీ పెళ్ళికొప్పను. పేమా దోమా ఏటిరా? వచ్చిందారి నెల్లు ఇంకోపాలి ఈ ఊసంటే ఏటి సేత్తానో

నాకే తెల్దు. నీ కూతురు నచ్చిందేవి కాదురా జట్టాదేవి. దానికసలికి సిగ్గూ నజ్జా నేదు. అయే ఉంటే మగాడెంటపడతదా . నా అంతటి లచ్చాదికారి దగ్గరికి నిన్ను రాయబారమంపుద్దా'' పొలయ్యలో సహనం సచ్చిపోయింది.

''ఏటిరా ఓగుతున్నావ్. నోరు సంభాళించుకో. సిగ్గూ నజ్జానేంది మా కుఱ్ఱదానికి కాదు. పొద్దున్నుంచి రేత్తిరిదాకా మందుకొడుతూ అచ్చోసిన ఆంబోతులా ఈధుల్లో పడి తిరుగుతున్నాడే నీ కొడుకు ఆడికేరా రెండూ నేవు. అట్టాటోణ్ణి పేమించడం మా అమ్మి సేసిన పెద్ద తప్పు. దాని మాటిని నీ గుమ్మమెక్కటం నాది తప్పు. ఆత్తికోసం పిల్లనోరిత్తార్రా. మా ఎర్రితల్లి మనసుపడ్డది. దాన్ని కాదనేత్తే మీ ఓడికి ఈజనమలో ఏ పిల్లా దొరకదు.''

''సూద్దాం లచ్చనమైన పిల్లదాన్ని తెచ్చి మా వోడికి బెమ్మాండంగా పెల్లి సెయ్యకపోతానా. నోటికొచ్చినట్టు కూత్తున్నావ్. మావాడ్ని తాగుబోతు ఆ బోతూ అంతావా. ఆడికున్న డబ్బుకి ఓరైనా పిలిసి పిల్లనిత్తారు. ఎటూ సెడేది నీ కూతురే.''

''ఆ మాటే అనొద్దంటున్నాను. ఇట్టంనేదంతన్నావు కదూ! ఎల్లి పోతాను.'' ''ఎల్లెల్లు. అదే నేను సెప్పేది. ఇంకెప్పుడూ నా గుమ్మం తొక్కకు. నానూ మీ గుమ్మం ఎక్కను. మీ దరిద్రపు ముఖాలు సూత్తేనే కంపరమెత్తి పొద్ది నా హోదాఏటి? నానేటి? చుట్టపొడవని ఓపాలికోపాలి మా ఇంటికెల్లిపొచ్చి ఓ పూట వుంతన్నాను. తింతన్నాను. అసలికి నేనెంత గొప్పోణ్ణి. నువ్వేట్టా అనేసుకున్నావు నీ ముట్టి సంబంధం సేసుకుంటానని ఇలాటి పాడుబుద్ధి నీ కుట్టింది గనక సుట్టరికం నేదు సట్టుబండలూ నేదు. మీ వోళ్ళ సేత్తోనే పచ్చి మంచి నీళ్ళు ఊడా ముట్టను.'' ఢంకా బజాయించి చెప్పిన పుల్లయ్య యిప్పుడీ స్థితిలో పడ్డాడు. చుట్టల కట్ట చేత్తో పట్టుకుని చావిట్లోకి వెళ్ళ బోతున్నవాడల్లా భార్య అవతారం చూసి దిమ్మెరపోయాడు.

''ఏటే ఓ సేతిలో చీపురు, చెంబులో నీళ్ళూ, ఇట్టా నామీదకి ఉరికొత్తన్నావేటే? '' ఏహే వల్లకుమావా. నీమాటెప్పుడు తిరకాసే గందా! ఆ సచ్చినోణ్ణి పేడ్నీల్లోసి సాగనంపే అని సెప్పడానికి మతిమరుపొచ్చే టీనీళ్ళకెళ్ళమన్నావ్.

'' స...స... అట్టా అరవకే. పెద్దమనిసిగందా! నాను టాంగు టీ ఒట్టికెల్లమన్నా.

'' ఆపని చేసినా. ఆడి ముఖం సూశాక వళ్ళంతా తేళ్ళూ, జెర్రెలు పాకుతున్నట్టు కాదు మావా పాములు పాకుతున్నట్టుంది. ఈ పని చేసేదాకా నాకు నిమ్మనం ఏడుంటుంది?''

మీరమ్మ వీరావేశాన్ని తన చాక చక్యంతో తగ్గించి, మానవ ధర్మం బోధించి అక్కడికి తనే ఒక మహామనిషి అయినట్టు క్షమాగుణంలో తనకి తానే సాటి అన్నట్టు వెళ్ళి పుల్లయ్య ఎదురుగా కుర్చీలో కుర్చున్నాడు.

'' ఏటి బావా? టీ సల్లారిపోనాది. అట్టుకుని అట్టాగే కూకుండి పోనావు. సూడు సెసలుగా

మా తమ్ముడు నుట్టిన లంకపుగాకు చుట్టలు ఓటి ముట్టించావా సొరగమే కనిపిత్తాది.'' అన్నాడు.

ఉలిక్కిపడిన పుల్లయ్య చల్లారిపోయిన టీన గబుక్కున మింగేశాడు. పొలయ్య అంటించిన చుట్ట వణకుతున్న చేత్తో అందుకుని నోటపెట్టి తడబడుతున్న పెదవులతో తను వచ్చిన పని బయట పెట్టాడు.

పెళ్ళానికి హితోపదేశాలు చేసిన పొలయ్య తోక తొక్కిన త్రాచులా బుసలు కొట్టాడు.

'' నువ్వసలు మనిషివేనట్రా. మళ్లీ మా సుక్కతల్లిని అడగడానికి నీకెన్ని గుండెలు. సర్మం వొలిసేత్తా. నచ్చాది కారివి గందా కొత్త శర్మం కుట్టుయమను. సుక్కనేక మీ సంద్రిగోడు ఎర్రోడు అయిలే నాకేటి. వేసం ఇడిసిపోతానంటే నాకేటి? ఆడోళ్ళంతా అట్టకట్టాలు పడ్డారు. గోర్నమెంటోళ్ళ గుండెలు కరిగించేసి పెబుత్వానికి నట్టం వొత్తేరానీ అని ఆల్లచేతే ఆర్డరేయించేసుకున్నారు. సుక్కేడు సుక్కనేక మీ సెంద్రిగాడోటాల్ల ఆటకట్టింది. ఏ డాకటోరు సెప్పిండురా! పెల్లిసేత్తే సుక్క పిచ్చి కుదురుద్దని అప్పుడారిచ్చిన మందులొంటపడ్డాయని'' అతని కంఠం ఉరిమింది.

పులిలాంటి పుల్లయ్య ఎప్పుడో పిల్లైపోయాడు. అతని సింహం అంతటి అహంకారం చీమంతకూడా మిగల్లేదు.

'' సత్తెపెమానికం బావా. డాకటేరు అట్టాగే సెప్పింఢ్రు. మందును మరవాలని. మాములు మనిసి కావాలని పద్దాసుపత్తిరిలో టీట్‌మెంట్ ఇప్పించినా. మనసుకూడా నెమ్మదిత్తే మార్తాడు పెళ్లి సేసేయమని సలహా యిచ్చేసింఢ్రు?''

''ఆ యేల సెప్పినావ్‌గా 'కో' అని అరిసేయ్. కోటిమంది వచ్చేత్తారు. పెలక్సను సేసేయ్. పని కానిచ్చేయ్''

''ఎటకారాలాడకు బావా! పెద్దమనసుతో చమించు. నీ దయుంటేనే ఆడునాకు దక్కుతాడు. సేసుకుంటే. సుక్కనే సేసుకుంటాడంట. నేకుంటే ఆ సుక్కకోసం సెన్నపట్నం పోతాడంట. ఆడ దొరుకుద్ది కదా మందు ముందుంటే ఆడికి మరేటీ అక్కర్లేదు.'' కాళ్ళా వేళ్ళా బతిమాలసాగాడు.పొలయ్య చలించలేదు.

''నా సిట్టితల్లి నీ ఇంటికే ఎల్లిపొచ్చి ఏటి సుకపడిపోద్ది నచ్చలు కోట్లు ఉంటే ఓరికికావారా. పేమగా ఆలుమగలూ గంజిమెతుకులు తిన్నా ఎట్టాటి సెడ్డ ఎసనాలు లేనోడితోటే ఆయిగా ఆడపిల్ల ఆయిగా కాపురం సేసుకునేది. పె బుత్తాల్ని పడగొట్టేసి ఆ బగీరథుడు శివుడు నెత్తి మీద గంగమ్మ తల్లిని దించుకొచ్చేసినట్టు సారాసుక్కని నీ నచ్చలు నాక్కొచ్చేయ గలవేమో చూడు నీ పిల్ల పోడు అపుడు సారుగుంతడు. నువ్ కుసీగుంతవు. డబ్బుంతే సానా బావా. ఏదైనా సేయొచ్చు'' దెప్పిపొడిచాడు.

''నచ్చిన పాముని సంపడం ఎందుకు బావా''

"అయితే మరెల్లిపో. మా ఇంటిది ఈ మాటలన్నీ ఇనేసిందో పేడనీల్లట్టుకొని పత్యత్యం అయిపోద్ది. ఆశాత్తి అనుభవించకుండానే బెగెల్లిపో. అదిగోరోయ్. ఎల్లిపొచ్చేత్తంది." ఆ వైపుగా వస్తున్న స్త్రీ ఆకారం వైపు చెయ్యి చూపిస్తూ బెదిరించాడు. ఆ ఆకారం ఎదుటపడేసరికి ఆశ్చర్యపోయాడు.

చుక్క తెల్లని చీరకట్టి, తలనిండా మల్లెపూలు పెట్టుకొని శాంతి దేవతలా వారి మధ్యకు వస్తుందని పోలయ్య ఊహకు ఎలా అందుతుది. అతని పెదవులు కదలబోయే సరికి తనే గళం విప్పింది.

"ఏంటినాన్న! పంతాలూ, పట్టింపులూ, నా మనసెప్పుడో చంద్రం బావకే ఇచ్చాను. బావని సేసుకుంటా."

"ఏటే అమ్మి? నీకు ఎర్రెత్తిపోనాదా! మనసంట మనసు. అదాలకుంటే మనవు కుదిరించడానికి నేనెల్లినప్పుడే అళ్ళు నీకు ఆరతి పెట్టేవోరు తల్లీ. నా మాటినుకో. ఆ తలమాసినోడంటే పిచ్చిమానుకో కాకి ముక్కుకు దొండపండువైపోతావేటే. ఆడికి నిన్నియ్యటమంటే కుక్కకి నెయ్యట్టినట్టేనే. సక్కగా సదువుకున్నావు. పొద్దుటేల పిల్లోల్లకు, రాతిరేల నా బోటోళ్ళకు పంతులమ్మవైపోనావు. నీవు మా ఇంటి లచ్చిందేవివే కాదే. ఊరంతకీ సదువులతల్లివి." కూతుర్ని ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నాడు. పుల్లయ్యలో తళుక్కుమన్న ఆవ మెరుపులా మాయమైంది.

చుక్క మరోసారి తీయగా గొంతు సవరించుకుంది. ఆ గొంతులో శాంతి మంత్రాలు వినిపించాయి.

"పంతులమ్మనన్నావుగా నాన్నా. బావకి ప్రేమ పాఠాలతో పాటు బ్రతుకు పాఠాలు కూడా నేర్పగలిగేదాన్ని నేనే కదా! ఒక జీవితాన్ని చక్కదిద్దడం కంటే మంచి పని ఏముంటుంది. నీవు మొండి పట్టుదలకి పోతే వ్యసనపరుడై ఆ చుక్కకోసం. మనసుపడ్డ ఈ చుక్కకోసం అల్లాడిపోతూ నా బావ ఏంకావాలి? ఎప్పుడూ మేమిద్దరం ప్రేమించుకున్నామో నేను అతని దాన్నే." చుక్క నిఖార్సుగా ఆ మాటమీదే నిలబడిపోయింది.

తల్లి బావిలో దూకి సస్తానంది. తండ్రి ఉరేసుకుంటానన్నాడు ఎవరేమనని ఆ ఇద్దరికీ బతుకంటే ఎంత తీపో తనకి తెలుసు కనక చస్తే చావండి అన్నది.

ఏం చేస్తారు పాపం. దేవుడా, రాముడా అనుకుంటూ అందరితోపాటు అక్షింతలు వేశారు. చుక్కని అత్తవారింటికి సాగనంపారు. ఆ ఇంట చుక్క, చంద్రుడు కలిసిన వేళ పున్నమి విరిసింది ❑

కథా నిలయం
6063
శ్రీకాకుళం